




# కరపత్రం

SINCE 2014

శనివారం మార్చి 14, 2026 సంపుటి : 2 సంచిక : 153 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4





## శ్రీశైలం వెళ్లిన గవర్నర్ శుక్లా

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

- 20 టిఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం
- అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది
- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- మూసీ ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?
- మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

2లో

**హైదరాబాద్,మార్చి13 :**
మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం.




# అస్సోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**గువాహటి,మార్చి13**
అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరార్ఝూర్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనీషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.



## 230 మంది మాజీ మావోయిస్టులకు నోటీసులు

**హుజూరాబాద్ పట్టణం:**
మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి ఎలియాస్ వికల్ప్ అంత్యక్రియలకు హాజరైన 230 మంది మాజీ మావోయిస్టులకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఇటీవల నోటీసులు జారీ చేయడంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో తీవ్ర కలవరం మొదలైంది.

2లో



## మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభ

- హాజరైన 230 మందికి ఎన్ఐఎ నోటీసులు

**కరీంనగర్,మార్చి13 :**
ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దృష్టి సారించింది.



2లో..

## నిజామాబాద్ జిల్లాలో ట్రావెల్స్ బస్సు బోల్తా.. నలుగురి మృతి

**ఇందల్వాయి:**
నిజామాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇందల్వాయి మండలం గన్నారం వద్ద జాతీయ రహదారిపై అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బస్సు 22 మందితో నాగ్‌పూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన సమీపంలోని టోల్‌ప్లాజా సిబ్బంది.. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రయాణికులంతా నిద్రలో ఉండగా ప్రమాదం చోటుచేసుకుందని.. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు చెప్పారు.



2లో..

## ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

- గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు

**గజ్వేల్,మార్చి13 :**
రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మదీనా మసీదులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, గజ్వేల్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ఇఫ్తార్ విందులో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ముస్లిం సోదరులకు రంజాన్ అత్యంత ప్రాముఖ్యమైన మాసం.



2లో..

## నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- సకాలంలో కేంద్రానికి చేరుకోవాలన్న అధికారులు

**నిజామాబాద్,మార్చి13 :**
ఉమ్మడి జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థి భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే టెన్త్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 13 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగనున్న వార్షిక పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 37 వేల మంది హాజరు కానున్నారు.



2లో..

## గ్యాస్ సరఫరాపై భయాందోళనకు గురి కావొద్దు

- బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు
- అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి
- గ్యాస్ కొరత పై జరుగుతున్న ప్రచారాన్ని సమర్ధవంతంగా తిప్పి కొట్టాలి
- సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దు
- గృహ ,ఆసుపత్రులకు,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ ,ఆశ్రమాలకు ప్రాధాన్యత
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ
- కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,మార్చి13**
అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.



2లో..

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు

### గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,మార్చి13**
ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు.

# పెరిగిన బుకింగ్‌లు.. సరఫరాపై నిబంధనలు

- కట్టెలను ఆశ్రయిస్తున్న గృహస్థులు, హోటల్ నిర్వాహకులు
- గ్యాస్ దొరక్క మూతపడుతున్న అనేక హోటళ్లు



2లో..

**నిజామాబాద్,మార్చి13**
యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గ్యాస్, పెట్రోలు, డీజిల్ సరఫరాలో మార్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో కమర్షియల్ సిలిండర్ల కొరత పెరిగింది. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులుంటే హోటళ్లు మూసివేయాల్సి వస్తుందని యాజమాన్యాలు ఇప్పటికే ప్రకటించాయి. అయితే డిమాండ్‌కు సరిపడా కమర్షియల్ సిలిండర్లు లేకపోవడం, సరఫరా చేసే అవకాశాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలుస్తున్నది.

# పెరిగిన బుకింగ్‌లు.. సరఫరాపై నిబంధనలు

మొదటి పేజీ తరువాయి
ప్రస్తుతం ఈ ప్రభావం గృహ కనెక్షన్లపైనా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎల్పీజీ కొరత లేదని అధికారులు చెబుతున్నా.. కొరత ఉంటుందనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు భయాందోళనకు గురవుతున్నారు. సిలిండర్లు బుక్ చేసేందుకు పోటీ పడుతున్నారు. ఈక్రమంలో బుకింగ్‌ల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతున్నది. గడిచిన నాలుగు రోజులుగా రోజుకు 25వేల పైచిలుకు బుకింగ్ అవుతున్నట్టు ఆయా గ్యాస్ కంపెనీలు ఏజెన్సీల ద్వారా తెలుస్తున్నది. గతంలో ఒక సిలిండర్ పూర్తయిన తర్వాత బుక్ చేసుకునేవారు. ప్రస్తుతం సిలిండర్ పూర్తి కాకముందే ముందు జాగ్రత్తగా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ సరఫరా లేక బుక్ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సరఫరా విషయంలో ఇప్పటికే కంపెనీలు, ఏజెన్సీలు పలు నిబంధనలు పెట్టాయి. ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్న వారు 21 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని, అలాగే రెండు సిలిండర్లు ఉన్న వారు 30 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని సూచిస్తున్నాయి. ఆ ప్రకారం బుక్ చేసినా సీరియల్ సంఖ్యను బట్టి డెలివరీ ఉంటుందని చెబుతున్నాయి. ఈ నిబంధన ఉమ్మడి కుటుంబాలు, ఎక్కువ కుటుంబ సభ్యులున్న కుటుంబాలకు ఇబ్బందిగా మారుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతానికి గ్యాస్ కొరత లేదని, కానీ, నిబంధనలు మాత్రం అమలు చేయక తప్పదని ఉమ్మడి జిల్లాలోని పౌరసరఫరా అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఇంకా వీలైనంత ఎక్కువ విక్రయించడానికి ఇన్నాళ్లు ఆయా కంపెనీలు బంకు యజమానులకు వివిధ రకాల స్కీంలను అమలు చేశాయి. కానీ, మూడు రోజులుగా ఆ స్కీములను ఎత్తివేశాయి. దీనికి కారణం ఆయా కంపెనీలు వీలైనంత మేరకు.. డీజిల్ విక్రయాలను తగ్గించే దిశగానే ఆలోచనలు చేస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పరిశ్రమలను డీజిల్ కొరత వెంటాడుతున్నది. వాహనాలపై కూడా ఇప్పుడిప్పుడే ప్రభావం చూపుతున్నట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలానే ఉంటే మరో మూడు నాలుగురోజుల్లో డీజిల్ ప్రభావం ప్రారంభమయ్యే అవకాశాలు ఉంటాయని యజమానులు చెబుతున్నారు.ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదంటూ చమురు సంస్థలు ప్రకటనలు చేస్తున్నాయి. గ్యాస్ కనెక్షన్‌దారులకు స్వయంగా మెసేజ్‌లు సైతం పంపిస్తూ అప్రమత్తం చేస్తున్నాయి. అవసరానికి తగిన మొత్తంలో సిలిండర్ల సరఫరా ఉందని చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో కాసులకు కక్కుర్తి పడుతోన్న గ్యాస్ ఏజెన్సీలు భిన్నంగా ప్రవర్తిస్తున్నాయి. కొరత ఉందంటూ ప్రచారం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఎల్పీజీ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సిలిండర్ బుకింగ్ చేసేందుకు క్యాష్ మాత్రమే తీసుకుంటుండటం అనుమానాలకు తావిస్తోంది. వారం క్రితం వరకు ఎల్పీజీ సిలిండర్ ధర రూ.928.50 ఉండగా రూ.60 పెంపుదలతో రూ.988కి చేరింది. వంటింట్లో సిలిండర్ అత్యవసరం కావడంతో రూ.వేయి వెచ్చిస్తున్నప్పటికీ సిలిండర్లు ఇంటికి చేరడం లేదు. ఇంట్లో పొయ్యి వెలిగించడమే గగనమైంది. సిలిండర్ బుక్ చేసేందుకు కొరత పేరుతో రూ.50 నుంచి రూ.100 వరకు గ్యాస్ ఏజెన్సీలు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుకింగ్ చేసుకున్న తర్వాత ఇంటికి సిలిండర్ చేర్చేందుకు సైతం సతాయిస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉందంటూ తప్పించుకుంటుండడంతో అదనంగా డబ్బులు ఇచ్చిన వారికే సరఫరా చేస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య సిలిండర్ల సరఫరా భారీగా క్షీణించింది. చమురు సంస్థల నుంచి డిమాండ్‌కు సరిపడా రాకపోవడంతో హోటళ్లు స్వచ్ఛందంగా మూసేస్తున్నారు. వ్యాపారాలు బంద్ చేసుకుని మిన్నకుండిపోతున్నారు. హోటళ్లు మూత పడటంతో ఉపాధి దెబ్బతిని కార్మికులు విలవిల్లాడుతున్నారు. మరోవైపు వివాహాల సీజన్ కావడంతో వాణిజ్య సిలిండర్ల కొరత ప్రభావం సెగలు పుట్టిస్తోంది. కట్టెల వంటపైనే వివాహాల్లో భోజనాలు రెడీ చేస్తున్నారు. ఒక్కసారిగా కట్టెలకు డిమాండ్ పెరుగుతుండటంతో వాటి ధరలు సైతం పెరిగినట్లుగా తెలుస్తోంది. కిరాయి ఇంట్లో జీవనం సాగించే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి.

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

మొదటి పేజీ తరువాయి
మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి
పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు.మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.కన్యాకుమారి లాగా బాపూఘాట్ కూడా రెండు నదుల సంగమం అని ఎంతమందికి తెలుసునని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టినట్లు తెలిపారు. గాంధీ విగ్రహానికి సుమారుగా రూ.75 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అంబేద్కర్ విగ్రహానికి కోట్లు ఖర్చు చేస్తే తాము వ్యతిరేకించలేదని సీఎం రేవంత్ చెప్పారు.

# ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి
ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రి÷-జడెన్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో
పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.
దేశానికి స్వాతంత్య్రం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

# వేమన పేరుతో యూనివర్సిటీ ఏర్పాటు ప్రేరణాత్మకం వైవియు స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్‌నజీర్

పట్టభద్రులు దేశాభివృద్ధిలో కీలకభూమిక పోషించాలని, సృజనాత్మక ఆవిష్కరణలు, వినూత్న పరిశోధనలతో మరింత రాణించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. కడపలో యోగి వేమన యూనివర్సిటీ స్నాతకోత్సవాలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కడప జిల్లా ప్రముఖ తత్వవేత్తలు, కవులు, మేధావులు, స్వాతంత్య్ర సమరయోధుల పుట్టినిల్లు అని పేర్కొన్నారు. ఈ జిల్లా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. దేవుని కడప, పెద్దదర్గా, సెయింట్ కేథడ్రల్ వంటి క్షేత్రాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ప్రఖ్యాతకవి, తత్వవేత్త, సామాజిక సంస్కర్త యోగి వేమన పేరు మీద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం ప్రేరణాత్మకమని పేర్కొన్నారు. రెండు దశాబ్దాల్లో యోగివేమన యూనివర్సిటీ సాధించిన పురోగతి అభినందనీయమన్నారు. సమాజం, పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠ్య ప్రణాళికలు, బోధనా విధానాలను నవీకరిస్తూ సమాజ ప్రయోజనాలకు ఉపయోగించే సామర్థ్యాలను కల్పించడానికి కృషి చేస్తోందని తెలిపారు. డాక్టరేట్లు, పతకాల గ్రహీతలు ఎంచుకున్న రంగాల్లో నిబద్ధతతో కష్టపడి పని చేసి విజయాలను సాధించాలన్నారు. హోనరిస్ కాసా గౌరవ డాక్టరేట్ గ్రహీత డాక్టర్ కోటా హరినారాయణ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి విద్యార్థులు, అధ్యాపకులు వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు రూపొందించాలని కోరారు. వైవియు వైస్ ఛాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ కాగ్నిషన్ పొందిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 176 మంది విద్యార్థులకు వైస్ ఛాన్సలర్‌తో కలిసి బంగారు పతకాలను, 70 మంది డాక్టరేట్ పట్టాలను అందజేశారు. 2021, 2022, 2023, 2024 సంవత్సరాల్లో గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ పూర్తి చేసిన 1,194 మందికి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ శ్రీనిధి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన పాల్గొన్నారు.

# 230 మంది మాజీ మావోయిస్టులకు నోటీసులు

మొదటి పేజీ తరువాయి
గత అక్టోబరు 18న మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల సంస్మరణ సభను 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' పేరిట కోహెడలో నిర్వహించారు. ఇందులో హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, వంగర, ముల్కనూరు, మాణిక్యాపూర్, ఆకునూర్, ఘన్‌పూర్, కమలాపూర్, టేకుమట్ల, పరకాల, వెంకటాపూర్, వేలేరు, ధర్మసాగర్ ప్రాంతాలకు చెందిన వారే అధిక శాతం మంది పాల్గొనగా.. వారందరికీ నోటీసులు జారీ అయ్యాయి. ఆ సభకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, గాదె ఇన్నయ్య, మాదన కుమారస్వామి, పినాకపాణి, కవ్వ లక్ష్మారెడ్డి, సురేశ్‌కుమార్, సంధ్య, ఆజాద్, పెంటయ్య, రవీందర్, మహ్మద్ హుస్సేన్ మరికొందరు హాజరై ప్రసంగించారు. ఈ క్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఇన్నయ్యతోపాటు మరికొందరిపై దేశద్రోహం కేసులు నమోదైన విషయం తెలిసిందే. వీటి దర్యాప్తు కోసమే తాజాగా మాజీ మావోయిస్టులకు నోటీసులు జారీ చేశారని వెల్లడవుతోంది.

# మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభ

మొదటి పేజీ తరువాయి
ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఏ ఆకస్మికంగా నోటీసులు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్యలాంటి వారిపై ఇప్పటికే
దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబంధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్నవారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, ఇప్పుడు పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

మొదటి పేజీ తరువాయి
నిజామాబాద్ జిల్లాలో 12,244 మంది బాలురు, 12,155 మంది బాలికలు హాజరు కానున్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న 6,451 మంది బాలురు, 6,703 మంది బాలికలు కలిపి మొత్తం 13,154 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల విధానంలో ఈ సారి మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది వరకు వార్షిక పరీక్షలు ఆదివారాలు మినహా వరుసగా నిర్వహించేవారు. ఈసారి మాత్రం ఒక్కో పరీక్షకు మధ్య 3 నుంచి 5 రోజుల వరకు గడువు పెంచారు. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లిష్, 28న మ్యాథ్స్, ఏప్రిల్ 2న ఫిజిక్స్, 7న బయాలజీ, 13 సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగనున్నాయి. 15, 16 తేదీల్లో ఒకేషనల్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షల నిమిత్తం 24 గంటల పాటు పని చేసేలా కంట్రోల్ నంబర్ (కామారెడ్డి-99596 70118, నిజామాబాద్-90302 82993) ఏర్పాటు చేశారు.పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకున్నట్లు డిఇవో తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసామని, పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలోనే ఉండేది. రెండేండ్లుగా పదో తరగతి ఫలితాల్లో వెనుకబడుతున్నది. గత రెండు సంవత్సరాల నుంచి కామారెడ్డి జిల్లా మరీ దారుణంగా వెనుకబడి పోతున్నది. ఈ నేపథ్యంలో ఉభయ జిల్లాల యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.

# ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి
ఆకలితో అలమటించే పేదవారి కడుపు బాధ ఎలా ఉంటుందో ఈ ఉపవాస దీక్షల ద్వారా ప్రతి ఒక్కరికి అర్థమవుతుందని' అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై స్పందిస్తూ.. 'గల్ఫ్ దేశాలలో యుద్ధ వాతావరణం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోతోంది. దీని వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. భవిష్యత్ లో పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా, గ్యాస్ సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సోదరుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ముస్లిం సోదరుల సంక్షేమం కోసం కట్టుబడ ఉంటామని' అన్నారు.

# గ్యాస్ సరఫరాపై భయాందోళనకు గురి కావొద్దు

మొదటి పేజీ తరువాయి
ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు,వృద్దాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి ,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**– రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి...**
**– పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 13:** గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత, మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని, ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం, శక్తిని క్రీడలు, చదువు, సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని, ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ డ్రగ్స్ వినియోగం--అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ప్రవచనకర్త ఎస్.పి. నాయక్ బంజారా, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్, అనూష, పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంట పట్టణంలోనిడబుల్ బెడ్రూం ఇల్లు నిరుపేదలకు అందించాలి కౌన్సిలర్ శీలం శ్రీనివాస్





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 13** కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ పరిధికి చెందిన 27వ వార్డు కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ పాల్గొని పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో జమ్మికుంట పట్టణ అభివృద్ధి దృష్ట్యా మొత్తం 500 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. అందులో కస్తూర్బా స్కూల్ సమీపంలో 256 ఇళ్లు, ధర్మారం ప్రాంతంలో 144 ఇళ్లు, మారుతీనగర్‌లో 100 ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాల వల్ల మధ్యలోనే ఆగిపోయి ఇప్పటికీ పూర్తి కాలేదని ఆయన తెలిపారు.
ప్రస్తుతం అనేక పేద కుటుంబాలు సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో లేదా తాత్కాలిక నివాసాల్లో జీవనం సాగిస్తున్నాయని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఈ అసంపూర్ణంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు.
ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి లబ్ధిదారులకు సుమారు రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్న నేపథ్యంలో, ఇదే విధంగా ఇప్పటికే నిర్మాణ దశలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేయడానికి కూడా రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించాలని శీలం శ్రీనివాస్ సూచించారు.
అలాగే జమ్మికుంట పట్టణంలో ఇంటి స్థలం లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ఈ ఇళ్లను కేటాయించి వారికి స్థిరమైన నివాసం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయాన్ని తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, పట్టణాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు.
ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్, ములుగు ప్రశాంత్ కుమార్ వైస్ చైర్మన్, ముంతాజ్‌అలీ జావేద్ మున్సిపల్ కమిషనర్, మహమ్మద్ అయాజ్ వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు.

# జమ్మికుంటలో విషాదం: రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పై నుంచి దూకి యువకుడు మృతి





**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, మార్చి 13:**
జమ్మికుంట పట్టణంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జమ్మికుంట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుండి కింద పడిపోవడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని కలిగించింది.
పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, హుజూరాబాద్ మండలంలోని సింగపూర్ గ్రామానికి చెందిన రామ్ రుక్కమ్మ (50) భర్త చంద్రయ్య శుక్రవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 30 సంవత్సరాల క్రితం కుటుంబం బ్రతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే నివసిస్తూ వచ్చిందని ఆమె తెలిపారు. రుక్కమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడు రామ్ శివరాజ్ (31) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు.
గత నాలుగు సంవత్సరాలుగా మద్యానికి బానిసై పనిచేసిన డబ్బులను తాగుడుకే ఖర్చు చేస్తూ వస్తున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు ఆరు నెలల క్రితం హైదరాబాద్ నుండి వచ్చి హుజూరాబాద్ ప్రాంతంలో తన బావబిడ్డ అయిన అల్కపల్లి జయ భర్త రాజు ఇంటి వద్ద నివసిస్తూ ఉన్నాడు.
ఈ క్రమంలో మార్చి 12వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిన శివరాజ్, జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి వెళ్లి అక్కడి నుండి కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతనికి తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
ఈ ఘటనపై మృతుడి తల్లి రామ్ రుక్కమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఘటనకు గల పూర్తి కారణాలు తెలుసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ సంఘటనతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది. స్థానికులు మృతుడి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

# పదో తరగతి విద్యార్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు -- 7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:13**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ రేపటి నుండి ప్రారంభమవుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి భయం, ఆందోళనలకు లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలను ఎదుర్కోవాలని సూచించారు. ఇప్పటివరకు సంవత్సరం పొడవునా చేసిన కృషిని గుర్తుంచుకొని ప్రశాంతమైన మనసుతో పరీక్షలకు హాజరవాలని కోరారు.
పరీక్షలు జీవితంలో ఒక ముఖ్యమైన దశ అయినప్పటికీ, అవి భయపడాల్సిన విషయం కాదని, సరైన ప్రణాళికతో మరియు ఏకాగ్రతతో చదివితే ప్రతి విద్యార్థి మంచి ఫలితాలను సాధించగలడని ఆయన తెలిపారు. ప్రతి ప్రశ్నను జాగ్రత్తగా చదివి సమాధానాలు రాయడం, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. విద్యార్థులు తమపై నమ్మకం ఉంచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, గురువులు చెప్పిన సూచనలను పాటిస్తూ పరీక్షలను రాయాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహిస్తూ వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. విద్యార్థులపై అనవసర ఒత్తిడి లేకుండా వారికి సహకారం అందించడం అవసరమని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే ముఖ్యమైన దశ అని, ఈ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించే అవకాశాలు మరింత మెరుగవుతాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ కుటుంబానికి, గురువులకు మరియు పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా జమ్మికుంట పట్టణానికి చెందిన విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో వారు వివిధ రంగాల్లో రాణించి సమాజానికి సేవ చేయాలని కోరుకున్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ కౌన్సిలర్ ఫెరోజ్ మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు విజయవంతంగా పరీక్షలు రాసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.

# కాలువల్లో పూడికతీత పనులను పూర్తి చేయాలి

**– నగర మేయర్ మహంకాళి స్వామి**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 13:**
వరద నీటి కాలువల్లో పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించడానికి శుక్రవారం తెల్లవారుఝామున్నే 3, 48, 49 డివిజన్లలో పర్యటించి మురుగు నీటి కాలువలను పరిశీలించారు. సాయిలీల హోటల్ ప్రక్క నుండి ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువ నిర్మించకపోవడం, పది సంవత్సరాలుగా సరిగా పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి పరిసరప్రాంత వాసులు భరించలేని దుర్గంధంతోపాటు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. మల్కాపూర్ శివారు లో నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నుండి టీచర్స్ కాలనీ వరకు వరద నీటి కాలువ కాంక్రీట్ నిర్మాణం చేపట్టి ఒక్క నీటి చుక్క కూడా నిలిచిపోకుండా సాఫీ గా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నగరంలోని అన్ని ప్రదాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ సంధర్భంగా ఆయన స్వయంగా జెసిబి యంత్రాన్ని ఆపరేట్ చేసి ముళ్ళ పొదలు, పిచ్చి చెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్ లతో పాటు డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, టిపిఎస్ నవీన్, వార్డు అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, జవాన్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# శాత్రాజ్ పల్లి ఇందిరానగర్ అంగన్వాడి స్కూల్లో అక్షరాభ్యాసం

**పాల్గొన్న కౌన్సిలర్ గుడిసె సంతోష కరుణాకర్**



వేములవాడ మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు శాత్రాజ్ పల్లి ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సీడీపీఓ సౌందర్య సూపర్వైజర్ ఆదేశాల మేరకు చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మూడో వార్డు కౌన్సిలర్ గుడిసె సంతోష కరుణాకర్ ను అంగన్వాడి టీచర్ గుడిసె పద్మ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

- భక్తుల పట్ల మర్యాదగా ఉండాలని ప్రతిజ్ఞ
- ట్రాఫిక్ సిఐ మోడెం సురేష్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ పట్టణంలోని తిప్పపూర్ బస్టాండ్ వద్ద గల మండల ఆటో డ్రైవర్ల యూనియన్ పాయింట్ వద్ద శుక్రవారం ట్రాఫిక్ సీఐ మోడెం సురేష్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించాలని, వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, ఫిట్‌నెస్ వంటి అన్ని పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సీఐ సూచించారు. అలాగే ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించి జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. మోటారు వాహన చట్టంలోని నియమాలను పాటిస్తూ భక్తులతో క్రమశిక్షణగా, మర్యాదగా ఉండాలని ట్రాఫిక్ సీఐ ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సముద్రాల రాజు, ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తో పాటు 200 మంది ఆటో డ్రైవర్లు సమావేశంలో పాల్గొన్నారు.